

భవనం పైనుండి జారి నిర్మాణ కార్మికుడు మృతి



మంగరాజు(ఫైల్)

జంగారెడ్డిగూడెం: సెంట్రింగ్ పని చేస్తూ ఐదో అంతస్తు నుండి జారిపడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఎపిడిఒ కార్యాలయ సమీపంలో జరిగింది. మంగళవారం మండలంలోని పట్టెన్నపాలెం గ్రామానికి చెందిన గుల్ల మంగరాజు(28) జంగారెడ్డిగూడెం పట్టణంలో ఓ భవనం ఐదో అంతస్తుపై సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కాలుజారి అక్కడ నుంచి కింద పడిపోయాడు. వెంటనే తోటిపనివారు మంగరాజును స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మంగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

అసైన్డ్ అన్యాక్రాంతం..!

పెద్దల చేతుల్లోనే పేదల భూములు
జిల్లాలో 63,220 ఎకరాలు పంపిణీ
మొత్తం 54,682 మంది లబ్ధిదారులు
ప్రస్తుతం భూముల్లో ఉన్న లబ్ధిదారులు నామమాత్రమే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. భూములు పొందిన లబ్ధిదారుల చేతుల్లో ప్రస్తుతం ఉన్న భూములు నామమాత్రంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వం చేసిన అసైన్డ్ చట్టంలోని మార్పులతో వేలాది ఎకరాల పేదల భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. 20 ఏళ్లక్రితమే అసైన్డ్ భూములకు బి-ఫారం పట్టాలు పొందిన వాస్తవ లబ్ధిదారులు, వారసుల స్వాధీనంలోకి అసైన్డ్ భూములపై పూర్తిహక్కులు కల్పిస్తామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. ఈ క్రమంలో పంపిణీ చేసిన భూములు ఎవరిస్వాధీనంలో ఉన్నాయో నిర్ధారించేందుకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. ఇప్పటి వరకూ జరిగిన పరిశీలనలో భూముల లెక్కలు, లబ్ధిదారుల లెక్కలు తేల్చిన అధికారులు, అవి ఎవరిస్వాధీనంలో ఉన్నాయో తేల్చేపనిలో నిమగ్నమయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మూడొంతులకు పైగా పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్‌భూములు పెద్దల చేతుల్లోకి చేరిపోయినట్లు తెలిసింది. ఏలూరు జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 27 మండలాలున్నాయి. 2003కు ముందు పంపిణీ చేసిన అసైన్డ్‌భూములు ఏలూరు డివిజన్‌లో 19,575 ఎకరాలు ఉండగా లబ్ధిదారులు 19,390 మంది ఉన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 23,051 ఎకరాలు భూమి పంపిణీచేయగా 15,536 మంది లబ్ధిదారులున్నారు. నూజివీడు డివిజన్‌లో 20,595 ఎకరాల అసైన్డ్‌భూమి పంపిణీ చేయగా 19,756 మంది లబ్ధిదారులున్నారు. ఏలూరు జిల్లామొత్తంగా 63,220.5 ఎకరాలు భూమి పంపిణీ జరగ్గా మొత్తం 54,682 మంది లబ్ధిదారులకు ఇచ్చినట్లు లెక్కతేలింది. ఇంత పెద్దమొత్తంలో పేదలకు భూమి పంపిణీ జరిగినప్పటికీ ప్రస్తుతం మాత్రం పేదల చేతుల్లో ఆ భూములు లేకుండా పోయాయి. మూడొంతులకు పైగా భూమి బడాబాబుల చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. నిబంధనల ప్రకారం అసైన్డ్, సీలింగ్ వంటి భూములకు సంబంధించి క్రయవిక్రయాలు చెల్లవు. ఈ భూముల పంపిణీ కోసం సిపిఎం వంటి వామపక్ష పార్టీలు జిల్లాలో అలుపెరుగని పోరాటం చేశాయి. ఈ అసహాయతను అసరాగా చేసుకున్న గ్రామాల్లోని పెద్దలు పది, పరక చేతిలో పెట్టి పేదల భూములను స్వాధీనం చేసుకుని స్వేచ్ఛగా అనుభవిస్తున్నారు. చేపల చెరువులు తవ్వేసి పెద్దఎత్తున ఆదాయం గడిస్తున్నారు.

మెట్టప్రాంతంలో పామాయిల్ వంటి పంటలను పండిస్తున్నారు. తమభూములు తమకు ఇవ్వాలని పలుచోట్ల పేదలు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో దళితులకు చెందిన దాదాపు 155 ఎకరాల అసైన్డ్ భూమిని విజయవాడకు చెందిన బడాబాబులు సొంతం చేసుకుని చేపలచెరువులు తవ్వేసి అనుభవిస్తున్నారు. తమభూములు తమకు ఇవ్వాలంటూ దళితులు పోరాటం చేస్తూనే ఉన్నారు. టి.నరసాపురంతో పాటు పలు మండలాల్లో భూపోరాటాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం అసైన్డ్ చట్టంలో చేసిన మార్పులు బడాబాబులకు అనుకూలంగా ఉండటంతో పేదల భూములు పెద్దలపరమయ్యే పరిస్థితి నెలకొందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే పంపిణీచేసిన అసైన్డ్ భూములన్ని పట్టాదారులకు, లేదావారి వారసులకు అందించాలని అంతా కోరుతున్నారు. ప్రభుత్వం ఏ విధంగా ముందుకు సాగుతుందో చూడాల్సి ఉంది.

జిల్లాలో పంపిణీ చేసిన అసైన్డ్ భూమి మొత్తం : 63,220 ఎకరాలు
లబ్ధిదారుల సంఖ్య : 54,682
డివిజన్ల వారీగా వివరాలు

డివిజన్	ఎకరాలు	లబ్ధిదారులు
ఏలూరు	19,575	19,390
జంగారెడ్డిగూడెం	23,051	15,536
నూజివీడు	20,594	19,756

అసమానతల్లేని సమగ్రాభివృద్ధే సిపిఎం లక్ష్యం

పార్టీ ప్రజాప్రణాళిక విడుదలలో జిల్లా కార్యదర్శి ఎ.రవి



సిపిఎం ప్రణాళికను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం రూపొందించిన ప్రజాప్రణాళికను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఉదయం ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో సిపిఎం రాష్ట్ర కమిటీ వివిధ రంగాల మేధావులు, ప్రొఫెసర్స్, జర్నలిస్టులు, నిపుణులతో రాష్ట్రంలోని ప్రజల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సెమినార్లు నిర్వహించిందన్నారు. ఆ సందర్భంగా వచ్చిన అనేక అభిప్రాయాలను క్రోడీకరించి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన ప్రజాప్రణాళికను సిపిఎం రూపొందించిందన్నారు. ముఖ్యంగా బిజెపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రత్యేకహోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విభజన చట్టంలోని హామీలు అమలు చేయలేదన్నారు. పైగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తుందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించి, ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలందరికీ విద్య, వైద్య సేవలు ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయరంగంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, స్వామినాథన్ కమిషన్, జయతీ ఘోష్, రాధాకృష్ణ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న పరిశ్రమలకు సహకారం అందించి ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలు తెరిపించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పనిదినాలు 200 రోజులకు పెంచి, కనీస కూలీ రోజుకు రూ.600 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింపజేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఒపిఎస్‌ను అమలు చేయాలని, ప్రయివేటు ఉపాధ్యాయులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సంస్కరణలు అమలు నిలిపివేయాలని, ప్రజలపై ఛార్జీల భారం తగ్గించాలన్నారు. గ్యాస్ సిలిండర్‌ను రూ.400, పెట్రోల్, డీజిల్ లీటరు రూ.60కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయాలని, భూమి లేని పేదలకు రెండు ఎకరాలు పంపిణీ చేయాలన్నారు. ఇల్లు లేని పేదలకు రెండు సెంట్ల స్థలం, రూ.ఐదు లక్షలు నిర్మాణానికి ఇవ్వాలన్నారు. మహిళలు, వికలాంగులు,మైనార్టీలకు రక్షణ కల్పించాలని, చేతివృత్తుల వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనాధ పిల్లలు, వృద్ధులకు ఉచిత వృద్ధాశ్రమాలు నడపాలన్నారు. పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. ఈ విధంగా అనేక అంశాలతో సిపిఎం తన ప్రణాళికను రూపొందించిందని వివరించారు. దీనిపై సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల నుండి బస్సు యాత్రలు నిర్వహిస్తుందన్నారు. వచ్చేనెల ఐదో తేదీన ఏలూరు జిల్లాలోకి రాష్ట్ర బస్సు యాత్ర ప్రవేశిస్తుందని, ఆరు, ఏడు తేదీల్లో జిల్లాలో పర్యటిస్తుందన్నారు. నవంబర్ 15వ తేదీన విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్, కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, బి. సోమయ్య, నాయకులు ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యం పాల్గొన్నారు.



శ్రీవారి సన్నిధిలో మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

చినవెంకన్నను రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రులు చివర రోజు కావడం వల్ల మంత్రి చిన్నవెంకన్నను దర్శించి విశిష్ట పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి త్రినాధరావు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు ఆలయ మర్యాదలతో శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి ప్రసాదాన్ని ఆలయ ఇఒ అందజేశారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ దసరా సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికి శుభం కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం ఆలోచన చేస్తున్న వ్యక్తి సిఎం వైఎస్.జగన్ అని అన్నారు. రాష్ట్రంలో ఒకపక్క సంక్షేమం, మరోపక్కఅభివృద్ధి రెండు కళ్ళుగా భావించి పరిపాలన చేస్తున్న జగన్‌కు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

అమరుల ఆశయాలు సాధించాలి

గారపాటి వర్ధంతి సభలో వక్తలు



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పెదపాడు

అమరవీరుల ఆశయ సాధన కోసం పనిచేయడమే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. పెదపాడులోని నాయుడుగూడెంలో అమరవీరుడు గారపాటి రాజారామ్మోహన్‌రావు 77వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల సీనియర్ నాయకులు లింగం కృష్ణారావు అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవి మాట్లాడుతూ 1946లో ఆనాటి కాంగ్రెస్ భూస్వాముల దాడిలో కత్తిపోటుకు గురై అమరుడైన గారపాటి రాజారామ్మోహనరావు త్యాగం వృధా కాదన్నారు. ఆయన ఎత్తిన ఎర్రజెండా కష్టజీవుల హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా రాజారామ్మోహనరావు పోరాడారని, ఆయన పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు. నేటి పాలకుల విధానాల ఫలితంగా ప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయని, కష్టాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. మార్క్సిస్టు సిద్ధాంతం, సోషలిజమే నిజమైన ప్రత్యామ్నాయమన్నారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో వారి ఆశయ సాధన కోసం యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగం కృష్ణారావు, షేక్ కరీముల్లా, పిట్టా రహాయేలు, ముసునూరి కొండలరావు, అక్కినేని వెంకటేశ్వరరావు, బొప్పన బలరామయ్య, గారపాటి రాజా,షేక్ షఫీరా పాల్గొన్నారు.




దాండియా నృత్యం చేస్తున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలి

దాండియా నృత్యం చేసిన ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

భీమవరం రూరల్: సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణ మార్వాడి సమాజ్ వారి ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమానికి గ్రంధి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భావితరాలకు మన సంస్కృతీ, సంప్రదాయాలను తెలియజేసే విధంగా మార్వాడీలు ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా మార్వాడీ సమాజ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మార్వాడీ సమాజ సభ్యులతో కలిసి రాజస్థానీ సాంప్రదాయమైన దాండియా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, వైసిపి పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, జైన్ యూత్ సంఘం నాయకులు హష్మక్ లాల్ జైన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవన్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు ప్రకాశం చౌక్, వెంకట రామ థియేటర్, తహశీల్దార్ కార్యాలయం, పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్, మావుళ్లమ్మ గుడి వీధి మీదుగా సాగింది.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు, హోంమంత్రి వనిత

క్వాలిటీ కంట్రోల్ కొటేషన్లు సేకరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే పనుల నాణ్యతాప్రమాణాలను నిర్ధారించడానికి థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సంస్థల నుండి కొటేషన్లు స్వీకరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు లక్ష రూపాయలు మించిన పనులకు నాణ్యతాప్రమాణాలను నిర్ధారణకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సంస్థలు సంబందిత పత్రాలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో, రిజిస్టర్ పోస్టు ద్వారా అందించాలని సూచించారు.

నేడు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 25 బుధవారం ఉదయం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీశీలించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 ఏళ్ల లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, చుట్టుపక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు. వసుధ ఫౌండేషన్, ఎస్‌ఎల్‌జి హాస్పిటల్స్, మానవత స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్య సహాయం అందిస్తాయన్నారు. వివరాలకు, ఇతర సమాచారం కోసం 9949093115, 9440859700, 6300180993, 9494338086 సంప్రదించాలని ప్రసాదరాజు తెలిపారు.

డాక్టర్ల మధ్య ఆరోగ్యకర వాతావరణం ఉండాలి

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కొత్త ఆసుపత్రుల రాకతో తాడేపల్లిగూడెం వైద్యపరంగా ఎంతో అభివృద్ధి సాధిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో డాక్టర్ నూకల మహిధర్ నూతనంగా ఏర్పాటు చేసిన సాయి సిద్ధార్థ హాస్పిటల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనరల్ సర్జన్ నిపుణులు కొరత ఉన్న ప్రస్తుత తరుణంలో పట్టణంలో జనరల్ సర్జన్ లాప్రోస్కోపిక్ సర్జరీలో నిపుణులైన డాక్టర్ నూకల మహిధర్ సిద్ధార్థ హాస్పిటల్ నెలకొల్పడం శుభపరిణామమన్నారు. ఎవరి రంగంలో వారే ప్రత్యేకతలతో కూడిన నైపుణ్యంగా వైద్య సేవలు అందిస్తే మరింత రాణించవచ్చన్నారు. తద్వారా డాక్టర్ల మధ్య మంచి ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడుతుందన్నారు. రోగులు వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే వైద్యం అందేలా వివిధ విభాగాల డాక్టర్లు సమిష్టి కృషి చేయాలన్నారు. వైద్యులు ఒకరికొకరు అంతర్గత సహకారం అందించుకోవాలన్నారు. ఇటీవల వస్తున్న ఆసుపత్రులు ఆధునిక సదుపాయాలతో, నిపుణులైన వైద్యులతో ఏర్పాటవుతున్నాయని, దీనివల్ల రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దశాబ్దాల తరబడి ఉన్న ఆసుపత్రులు వైద్యులు నేటి ఆధునిక యుగంతో వివిధ కారణాల రీత్యా పోటీ పడలేక వెనుక పడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొత్తగా ఆసుపత్రులు రావడం, నిపుణులైన డాక్టర్లు అందుబాటులోకి రావడం, రోగులు వైద్య సేవలు పొందడంలో మరింత వెసులుబాటు కల్పిస్తోందన్నారు. వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాలు, వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న పథకాలతో ప్రభుత్వ వైద్యాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

అందుబాటులోకి వైద్య సేవలు : హోంమంత్రి వనిత

ఆసుపత్రులు పెరగడం ద్వారా వైద్య సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. సాయి సిద్ధార్థ హాస్పిటల్స్ భవనం మొదటి అంతస్తులో విభాగాలను డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా ఖరీదైన వైద్య రంగంలో ఆసుపత్రులు పెరగడం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. డాక్టర్ నూకల మహిధర్ ఈ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సాయి సంజీవని హాస్పిటల్ అధినేత డాక్టర్ పుప్పాల మురళీకృష్ణ, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ తానేటి శ్రీనివాసరావు, డాక్టర్ వి.రమాదేవి, డాక్టర్ యడ్లపాటి భవాని, పలువురు డాక్టర్లు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కర్ రావు, ఆరేటి ప్రకాష్, సీనియర్ జర్నలిస్టు కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బాదుడు..!

ముగిసిన దసరా ఉత్సవాలు
తిరుగు ప్రయాణమవుతున్న జనం
అధిక బస్ ఛార్జీలతో ప్రయాణికుల అవస్థలు
సామాన్యుడిపై పెను భారం




ప్రజాశక్తి - ఆచంట(పశ్చిమగోదావరి)

దసరా పండుగ వచ్చి వెళ్లింది. పండుగ నిమిత్తం గ్రామాలకు వచ్చిన వారు పట్టణాల బాట పడుతున్నారు. అయితే ఛార్జీల మోతతో ప్రయాణం ప్రజలకు పెను భారంగా మారింది. దూర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న వారంతా స్వగ్రామాలకు వెళ్లడానికి ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే వీరికంటే ముందే ఆర్‌టిసితో పాటు ప్రయివేటు ట్రావెల్స్ నిర్వాహకులు ఛార్జీల రూపంలో నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. సాధారణ రోజుల్లో కంటే దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగ సమయాల్లో ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేస్తూ ప్రయాణికులపై భారం మోపుతున్నారు. ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు కూడా మామూలు రోజుల కంటే నాలుగు రెట్లు అధికంగా టిక్కెట్లు ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణం అంటేనే దడ పుట్టించేలా చేస్తున్నాయి. అయితే రవాణా శాఖ అధికారులు మాత్రం కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

బాదుడే బాదుడు..

జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఎక్కువగా ప్రయాణికుల రద్దీ ఉంటుంది. ప్రస్తుతం దసరా పండుగ అయిపోవడం, విద్యాసంస్థలకు సెలవులు కూడా ముగియడంతో జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. భీమవరం, నర్సాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు ప్రాంతాల నుంచి ప్రయివేట్ బస్సులు ఎక్కువగా నడుపుతున్నారు. ఈ తరహాలో వేరే దారిలేక ప్రయాణికులు వారి అడిగినంత చెల్లించి ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఛార్జీలు చూసి ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా జిల్లా నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించడానికి సాధారణ రోజుల్లో టిక్కెట్ ధర దూరాన్ని బట్టి రూ.600 నుంచి రూ.700 వరకూ ఉంటుంది. ప్రస్తుతం దసరా పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఒక్కో టిక్కెట్ ధర రూ.1200 నుంచి రూ.2 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమైనా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. చేసేది లేక అడిగినంత ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయివేటు బస్సుల స్థాయిలో కాకపోయినా ఆర్‌టిసి కూడా ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా రద్దీని బట్టి ఆ సంస్థ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసి ఛార్జీలను కూడా ప్రత్యేకంగా వడ్డిస్తోంది. దీంతో ఆర్‌టిసి ప్రయాణం కూడా ప్రయాణికులకు భారంగా మారుతుంది. వివిధ రకాల సర్వీసులను నడుపుతున్న ఆర్‌టిసి ఛార్జీలను కూడా ఒక్క విధంగా వసూలు చేస్తూ ప్రయాణికులను నట్టేట ముంచుతున్నారు.


ఎంపికైన విద్యార్థులతో హీల్ వ్యవస్థాక అధ్యక్షులు సత్యప్రసాద్

యోగా పోటీల్లో హీల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


సౌత్‌జోన్ యోగా ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని తోటపల్లి హీల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అండర్-14 విభాగంలో మొదటి స్థానం నిలిచి బంగారు పతకం సాధించారు. జాతీయస్థాయి యోగా పోటీలకు 19 మంది విద్యార్థులు ఎంపికైనట్లుగా హీల్ సిఇఒ కె.అజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కోనేరు సత్యప్రసాద్, సిఇఒ కూరపాటి అజయ్ కుమార్, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్.ప్రభుదాసులు అభినందించారు.


సమావేశం ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న గన్ని

28న టిడిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 28న ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నారాయణపురంలో నిర్వహించనున్నారు. ఈమేరకు మంగళవారం ఆపార్టీ నాయకులతో ఏలూరు పార్లమెంటరీ టిడిపి గన్ని వీరాంజనే యులు సమాయత్త ఏర్పాట్లు, ఇతర అంశాలపై సమీక్షించారు. స్థానిక లయన్స్ క్లబ్ ఎదురుగా రంగరాజు పెట్రోలు బంకు ఆవరణలో సమావేశానికి అనువైన ప్రాంగణాన్ని గుర్తించారు. మండల ముఖ్యనాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు సప్పా వీరబాబు, మండల కార్యదర్శి నల్లా ఆనంద్, దిడ్ల శ్రీను, మారిశెట్టి ప్రసాద్, సింగులూరి రామకృష్ణ, గురువెళ్లి రాజారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.


వెండి దీపారాధన కుందెలు అందజేస్తున్న భక్తులు

శివాలయానికి దీపారాధన కుందెలు వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో శివాలయానికి తాడేపల్లిగూడెంకు చెందిన లంక రామస్వామి, ధన్యశ్రీ దంపతులు కిలో వెండితో దీపారాధన కుందెలు తయారు చేయించి దసరా, విజయదశమి సందర్భంగా వితరణ చేశారు. మంగళవారం ఆలయ కమిటీ ఛైర్మన్ బొడ్డేపల్లి అప్పారావుకు వీటిని అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు అరివెళ్లి మహాలక్ష్మి ధనయ్య, డిప్యూటీ తహశీల్దారు బివి దుర్గాప్రసాద్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పొలం వివాదంలో పలువురిపై కేసు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండలం వంకబొత్తప్పగూడెంలో తనకు చెందిన పొలంలో వ్యవసాయం చేస్తుంటే అడ్డుకుంటున్నారని జి.శుభశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన వంకా ప్రసాద్, వంక పెంటయ్య, కుసుం శ్రీనివాసులు, కుజుం ప్రసాదు, మడకం వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జిజె విష్ణువర్ధన్ ఆదివారం తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్



మండలంలోని మెట్టగూడెం గ్రామానికి చెందిన జుజ్జూరు రవికిరణ్(17) ఈనెల 21వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రవికిరణ్ ఏలూరులో ఇంటర్‌మీడియట్ చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడి పందేల శిబిరాలపై దాడులు

13 మంది అరెస్టు - రూ.9,870 స్వాధీనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పలు చోట్ల కోడి పందేల శిబిరాలపై దాడులు చేసి 13 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండలంలోని అంకన్న గూడెం, తాటి రామన్న గూడెం శివారులో కోడి పందేలు ఆడుతున్నారని సమాచారం మేరకు ఎస్ఐ, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మొత్తం 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.9 వేల 870 నగదును, నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అప్పుల బాధ తాళలేక వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీనివాసపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కొండపల్లి మేరీ(28) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త ప్రసాద్ స్థానిక వైన్ షాపులో పనిచేస్తున్నాడు. అయితే మంగళవారం ఉదయం భర్త ప్రసాద్ పని నిమిత్తం వేరే ఊరు వెళ్లడం, ఇంట్లో కూడా ఎవరూ లేని సమయం చూసి అప్పుల బాధ భరించలేక మేరీ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లి మణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు..!

భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్న యువత

కన్నవారి కలలు కాలరాస్తూ పెడదోవ

గంజాయిని నిర్మూలించాలని ప్రజలు వేడుకోలు



ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మనిషి ప్రవర్తనను ఉగ్రంగా మార్చే.. గంజాయి మత్తు అన్ని వయసుల వారిని తన గుప్పిట్లోకి లాక్కుంటుంది. ఈ మయదారి మత్తులో పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం చిక్కుతూ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. బంగారు భవిష్యత్ కోసం శ్రమించాల్సిన యువకులు.. తెలియని ఆనందం అంటూ గంజాయిని గుప్పుమనిపిస్తున్నారు. జీవితం నాశనం చేసుకుంటున్నారు. ఈ విషయం ప్రభుత్వాలకు, అడ్డుకట్ట వేయాల్సిన పోలీసు వ్యవస్థలకు తెలిసినా సమర్థవంతమైన నివారణా చర్యలు తీసుకోలేకపోతున్నాయి.

గంజాయి మత్తులో యువత తమ జీవితాలను ఛిద్రం చేసుకొంటున్నారు. ఆగిరిపల్లి మండలంలో 25 గ్రామ పంచాయతీలు, ఎనిమిది శివారు గ్రామాలతో కలుపుకొని 33 గ్రామాలు వున్నాయి. కాయ కష్టం చేసుకొనే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువత వింత సంస్కృతితో నాటుసారా, మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారు. వింత పోకడలతో, మరో ప్రపంచంలో విహరిస్తూ, తమ చుట్టూ వున్న పరిసరాలను సైతం గమనించే స్థితిలో లేకుండా పోతుంది నేటి యువత. తమపై ఆశలు పెట్టుకొన్న కన్నవారి కలలను కాలరాస్తూ, తమ జీవితాలను అంధకారం చేసు కోవడం పట్ల పలువురి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి సరఫరాదార్లు తమ సంపాదనే ధ్యేయంగా పల్లెటూళ్లలో పాగా వేసి, యువతనే లక్ష్యంగా చేసుకొని, ద్విచక్ర వాహనాలపై వచ్చి గ్రామ శివారు ప్రాంతాలల్లో గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నారు. యువతను మాదక ద్రవ్యాలకు బానిసలుగా చేస్తూ వారిని పక్కదోవ పట్టిస్తున్నారు. తమ గ్రామాలలోనికి ఎప్పుడు గంజాయి అమ్మకం దారుడు వస్తాడా అని యువత ఎదురుచూసే స్థాయిలో ఉన్నారంటే, యువత గంజాయికి ఏ స్థాయిలో బానిసలయ్యారో అర్థం చేసుకోవచ్చు. మాదక ద్రవ్యాల సేవనం వలన దాని ప్రభావం మెదడు, నరాలపై చూపటంతో విచక్షణ కోల్పోయిన యువత తమ శరీరాలను గాయాల పాలు చేసుకుంటున్నారు. దీంతోపాటు తల్లి, దండ్రి, అక్కా, చెల్లి, భార్య అనే విచక్షణ లేకుండా వారిపై భౌతికదాడులకు తెగపడుతున్నారు. క్షణికావేశంలో ప్రాణాలు సైతం పోగోట్టుకొనే పరిస్థితులకు యువత చేరుకోవడం ఆందోళన కల్గిస్తుందని పలువురు వాపోతున్నారు. ఈ గంజాయి విక్రయాలు మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా వడ్లమాను, కొండకాలనీ, గొల్లగూడెం, పిన్నమరెడ్డిపల్లి, తాడేపల్లి చొప్పరమెట్ల, సింహాద్రి అప్పారావుపేట గ్రామాల్లో విస్తృతంగా జరుగుతున్నట్లు సమాచారం. పలుసార్లు గంజాయి అమ్మకం దార్లపై పోలీసుదాడులు జరిగినప్పటికీ అమ్మకందార్లలో ఎటువంటి భయం లేకుండా పోవడంతో కన్నవారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా, యువతనే లక్ష్యంగా చేసుకొని గంజాయి అమ్మకాలు సాగిస్తున్న ముఠాగుట్టు రట్టు చేసి, నాటుసారా, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను నిలువరించి, యువత భవిష్యత్తును కాపాడవల్సిందిగా పలువురు కోరుతున్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా..

'సైకో పోవాలి' ప్రతుల దహనం



ముసునూరులో ప్రతులను దహనం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

సైకో పాలన పోవాలి - సైకిల్ పాలన రావాలంటూ మండలంలోని టిడిపి నాయకులు దసరా నవరాత్రుల సందర్భంగా టిడిపి పిలుపు మేరకు సైకో పోవాలి అని రాసిన ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సైకో పాలన పోవాలంటే జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా ఓడించాలని కోరారు. ఫెడల్ క్యాస్ట్రో చెప్పినట్టు అవినీతిపరులు, దొంగల పాలన చేస్తే నీతివంతులు జైల్లో ఉంటారని అదే రాష్ట్రంలో నిజమైందన్నారు. నిజాయితీగా పాలన చేసిన చంద్రబాబు అక్రమ అరెస్ట్ దానికి నిదర్శమని తెలిపారు. ప్రజలందరూ ఈ రాక్షస, సైకో పాలనపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, మెదరమెట్ల సురేంద్ర, కాటేపల్లి సత్యనారాయణ, గద్దల మోహన్ రావు, గద్దల సుహాసిని, సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, పర్వతనేని వెంకటేశ్వరరావు, అజాయ్, పులిబళ్ల లక్ష్మీ సత్యనారాయణ, సురేషు, లక్క పాము కాంతారావు, గార్లపాటి నరసింహారావు, పాకనాటి వీరాంజనేయులు, ఉప్పలపాటి గణేష్, రంగు వాసు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేశారని, ఆధారాలు లేకుండా జైల్లో పెట్టి కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, టిడిపి మాజీ నియోజకవర్గ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి తెలిపారు. చింతలపూడి మండలం యండపల్లి గ్రామ పంచాయతీలో బాబు కోసం నేను సైతం అంటూ టిడిపి కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. 92612 92612 నెంబర్‌కు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మిసిడ్ కాల్ ప్రజల నుంచి ఇప్పించారు. అనంతరం గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, నియోజకవర్గ నాయకురాలు యాళ్ల లీలా ప్రశాంతి, జిల్లా రైతు మీడియా కోఆర్డినేటర్ చెరుకూరి అంకమరావు, ఎంపిటిసి సభ్యులు కపూర్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు నందీపాము నాగేశ్వరరావు, పొదిల రాయప్ప, మహిళా కార్యదర్శి మాకే సంగీత, గడిదేసి యేసు, పల్లె మున్నా, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవి, నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, యూనిట్ ఇన్‌ఛార్జి కొమ్మినేని నాగు, కోండ్రు నతానియేలు, నక్కా సర్వేసు, చిన సత్యనారాయణ, జ్యుట్రు అంజి, మధు, సాయి, కోండ్రు మణి శంకర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడిలో ఇంటింటా కార్యక్రమంలో టిడిపి నేతలు


ఆలయంలో కిక్కిరిసిన యాత్రికులు

మద్దిలో అన్నదానం

ఆదాయం రూ.3,40,967

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో ఒక్క రోజు ఐదు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఈ క్రమంలో ఒక్కరోజు ఆదాయం వివిధ సేవల రూపేణ రూ.3,40,967 లు సమకూరినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కొండలరావు తెలిపారు. అలాగే భవానిమాల ధారణ యాత్రికులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారని తెలిపారు. కుప్పలవారిపాలెంనకు చెందిన శ్రీరామ సరస్వతి భజన సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారని ఇఒ కొండలరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీసు అధికారి

ప్రజాశక్తి - ఏలూరు

పట్టణంలో దసరా నవరాత్రులు పురస్కరించుకొని ఆయుధ పూజ సందర్భంగా ట్రాఫిక్‌పై సోషల్ వర్కర్ చలసాని సురేంద్ర (పెప్పీ) అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సిగ్నల్ లైట్లు ఫైర్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన సందర్భంగా మంగళవారం నిస్వార్థమైన సేవ అందిస్తున్నాం అనే కార్యక్రమం చేపట్టారు. రోడ్ ప్రమాదాల వలన కలిగే అనర్థాలు, వాటి నివారణకు పలు సూచనలు సలహాలను పాటిస్తే రోడ్ ప్రమాదాలు నివారించవచ్చు అని ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కులమత తారతమ్యాలు లేకుండా అందరూ ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఒక్కరి నిర్లక్ష్యం, అజాగ్రత్త ఎదుటివారి ప్రాణాపాయానికి కారణమవుతుందన్నారు. ఆ కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కావున ఎటువంటి స్వార్థం లేకుండా సర్వీస్ చేసే సిగ్నల్ లైట్లుతో పాటు పబ్లిక్ కూడా వాలంటీర్‌గా వచ్చి ట్రాఫిక్‌లో తమవంతు సాయం చేసి, ట్రాఫిక్ ఇబ్బందులు లేని టౌన్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ పోలీస్ వారు వివిధ రకాలైన డ్యూటీలో వున్నప్పుడు వాలంటీర్లు నిస్వార్థంగా ట్రాఫిక్ జంక్షన్‌లోను, ట్రాఫిక్ జామింగ్ ప్లేస్‌లో సేవాలందించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవిఎస్‌వి ప్రసాద్, బిషప్ హౌస్ చర్చి ఫాదర్ మిచెల్, సుభోద హౌస్ ఫాదర్ అల్ఫోన్సా, తంగెళ్లమూడి మసీదు ఇమామ్, లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ రామారావు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ జి.నాగేంద్ర, సంఘ సేవకులు సుబ్బారావు పాల్గొన్నారు.

ముగిసిన దసరా విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - పెదపాడు

పెదపాడు శాఖ గ్రంథాలయంలో దసరా సెలవుల్లో భాగంగా నిర్వహించిన దసరా విజ్ఞాన శిబిరంలో ఆఖరి రోజు మంగళవారం విద్యార్థులతో కథలు చదివించడం, చెప్పడం, పుస్తక పఠనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దసరా విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న 30 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో, సెలవు రోజులలో గ్రంథాలయానికి వచ్చి గ్రంథాలయంలోని పుస్తకములు చదివి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిందిగా కోరారు. తదుపరి స్నాక్స్ అందించి దసరా విజ్ఞాన శిబిరం ఘనంగా ముగించారు.


విజ్ఞాన శిబిరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పండుగ పేరుతో సినిమా థియేటర్లలో దోపిడి

ఇష్టానుసారంగా బ్లాక్‌లో అమ్ముతున్న టికెట్లు

ప్రజాశక్తి - ఏలూరు

ఒక కుటుంబంతో సినిమా చూడాలంటే వేలల్లో ఖర్చు పెట్టాల్సి వస్తుంది. మామూలుగా రూ.150 టికెట్ అయితే రూ.200 నుంచి 250 వరకు వసూలు చేస్తున్నట్టు ప్రజలు తెలియజేస్తున్నారు. పండుగ పేరుతో ఏలూరులో పలు థియేటర్‌లు భారీగా బ్లాక్‌లో టికెట్లు అమ్ముతున్నట్టు ప్రజలు తెలియజేస్తున్నారు. థియేటర్ యాజమాన్యాలు కూడా బుకింగ్‌లో ఇవ్వవలసిన టికెట్లు కూడా బ్లాక్‌లో అమ్ముతాం ఏం చేస్తారో చేసుకోండి అంటున్నారని ప్రజలు వాపోతున్నారు.



ఇప్పటికైనా జిల్లా అ ధికారులు ది: యేటర్లలో జ రిగే బ్లాక్ టికెట్ల అ మ్మకాలు అ రికట్టాలని ప్ర జలు కోరుకుంటున్నారు.

మావుళ్ళమ్మ సన్నిధిలో విప్ గ్రంధి

భీమవరం రూరల్ : శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా శ్రీశ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి అలంకరణలో ఉన్న శ్రీ మావుళ్లమ్మను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, పాలకవర్గం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.